

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు... నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి... వగైరా...వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## 'తలచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యమే!'
## – 'కాస్ట్యూమ్' కృష్ణ

(విజయచిత్ర 1994 ఏప్రిల్ సంచికనుంచి పునర్ముద్రణ)


'తలచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యమే!'
- 'కాస్ట్యూమ్' కృష్ణ

'నా స్వస్థలం విశాఖపట్నం జిల్లా లోని లక్కవరపు కోట. మూడో క్లాసు వరకూ అక్కడే చదువుకున్నాను. ఆ తర్వాత మరి చదువబ్బలేదు. చదువెలాగూ అబ్బలేదు బట్టలు కుట్టుకునైనా బతుకుదామని రాజమండ్రి వెళ్ళాను. అక్కడ మా అన్నయ్య శ్రీ రామ్మూర్తి టైలరింగ్ దుకాణంలో కాజాలు కుట్టడం ప్రారంభించాను. అలా కొంతకాలం గడిచీ గడవగానే. వైజాగ్ లో రైల్వేలో పని చేస్తున్న మా పెద్దన్నయ్య రైల్వేలో పనిప్పిస్తాను రమ్మంటే రైల్వే ఉద్యోగం కదా అని హుషారుగా రైలెక్కి వైజాగెళ్ళాను.

అక్కడ మా అన్నయ్య లోకో షెడ్డుకి తీసికెళ్ళి ఇంజన్లో బొగ్గెయ్యమన్నాడు. 'అదేమంటే ఇదే నీ ఉద్యోగం' అన్నాడు.

దాతో బేజారెత్తి 'ఇంతకన్నా బట్టలు కుట్టుకుని బతకడమే బెటర్' అని తిరుగు టపాలో రాజమండ్రి చేరుకున్నాను బుద్ధిగా కుట్టుపని నేర్చుకోడానికి. కుట్టు పని పూర్తిగా వచ్చీ రాకుండానే రాజమండ్రిలో గొడవలు పెట్టుకుని అక్కడ్నుంచీ పారిపోయి మద్రాసొచ్చి ముత్తు కృష్ణా స్ట్రీట్ లో వెంకటరాయుడు గారి టైలరింగ్ షాపులో చేరి ఆయన వద్ద 'టైలరింగ్' విద్య కొనసాగించాను.

1959వ సంవత్సరం – చివర్లో 'కృష్ణ ప్రేమ' చిత్ర నిర్మాత ముచ్చెర్ల రామదాసు గారు నన్ను 'కాస్ట్యూమ్స్' నారాయణ మూర్తిగారికి అప్పజెప్పారు. ఆయన నన్ను తన స్వంత కొడుకులాగ చూసుకుని 'టైలరింగ్' మొత్తం నేర్పించారు. దాదాపు ఐదు సంవత్సరాలు ఆయన దగ్గర శిష్యరికం చేసి, 1964లో సురేష్ ప్రొడక్షన్స్ సంస్థలో చేరి, 'కాస్ట్యూమ్స్ అసిస్టెంట్ గా నాలుగు సంవత్సరాలు పని చేశాను. ఆ సంస్థ అధినేత డి.రామానాయుడు గారు 'పాప కోసం' చిత్రానికి 'కాస్ట్యూంస్ ఛీఫ్' గా పని చేసే అవకాశాన్ని ఇచ్చి ప్రోత్సహించారు. అప్పటి నుంఛీ 'కాస్ట్యూమ్స్' కృష్ణగా పరిశ్రమలో కొనసాగుతున్నాను అన్నారు ప్రముఖ నిర్మాత,నటుడు, 'కాస్ట్యూమ్' కృష్ణ ఇటీవల 'విజయచిత్ర'తో ముచ్చటిస్తూ.

ముప్పై అయిదు సంవత్సరాలుగా చిత్ర రంగంలో వుంటూ సురేశ్, రమణ చిత్ర, విజయలక్ష్మీ మూవీస్, దేవీ ఫిలిమ్స్, క్రాంతి చిత్ర, విజయమాధవీ, పద్మాలయా, వైజయంతి మూవీస్, వి.యం.సి. మొదలైన పెద్ద పెద్ద చిత్ర నిర్మాణ సంస్థలు నిర్మించిన అనేక చిత్రాలకు 'కాస్ట్యూమ్ డిజైనర్' గా పని చేశారు. అంతేగాకుండా ఎన్.టి.ఆర్., ఏ.ఎన్.ఆర్., శోభన్ బాబు, కృష్ణ, నాగార్జున, చిరంజీవి, వెంకటేశ్, బాలకృష్ణ, జమున, వాణీశ్రీ, జయప్రద, జయలలిత, శారద, విజయశాంతి, వంటి అగ్రశ్రేణి తారలకు 'పర్సనల్ కాస్ట్యూమ్ డిజైనర్'గా పని చేశారు కృష్ణ.

నేను పర్సనల్ 'కాస్ట్యూమ్ డిజైనర్' గా పని చేసిన తారల్లో ఇద్దరు(ఎన్.టి.ఆర్., జయలలిత) రాష్ట్ర ముఖ్యమంత్రులు కావడం నా జీవితంలో మరచిపోలేని మధురానుభూతికి గురిచేసే సంఘటనలు' అంటారు కృష్ణ.

'కాస్ట్యూమ్ డిజైనర్' గా చిత్ర రంగ జీవితాన్ని ప్రారంభించిన కృష్ణ సినిమా నిర్మాతగా, ఆ తర్వాత నటుడుగా మారడానికి దోహదం చేసిన పరిస్థితులేమిటి?

దాదాపు ఆరేడేళ్ళ క్రితం – ఓ రోజు ప్రొడక్షన్ మేనేజర్ శేఖర్. నేను పిచ్చాపాటి కబుర్లాడుకుంటూ వుండగా అకస్మాత్తుగా "సరదాగా మనమెందుకు ఓ సినిమాని తీయ కూడదు?" అని అనుకున్నాం. అనుకోడమేమిటి వెంటనే తీసే తీరాలని తీర్మానానికి వచ్చి రెండో ఆలోచనకి తావీయకుండా ముందు దర్శకులు బి.గోపాల్ కి అడ్వన్స్ ఇచ్చేశాం. ఆ తర్వాత కృష్ణ విజయశాంతి, శారద గార్లను కలుసుకుని, మా ప్రాజెక్టు గురించి వివరించి చెప్పి మెం అప్పట్లో తీయబోయే సినిమాకి వారి కాల్షీట్లు సంపాదించాం. పరుచూరి బ్రదర్స్ చేత కథ తయారు చేయించి మా తొలి ప్రయత్నంగా

'అశ్వద్ధామ' చిత్రాన్ని నిర్మించాం. ఆ చిత్రం విజయవంతంగా నడిచింది. ఆ ఉత్సాహంతోనే, రామానాయుడు గారి సహకారంతో వెంకటేశ్ బాబు, అమల, శారద గార్లతో 'అగ్గిరాముడు' చిత్రం నిర్మించాం.

ఆ తర్వాత మూడో చిత్రం నిర్మించే ప్రయత్నాల్లో ఓసారి హైదరాబాదు వెళ్ళాను. అప్పుడు అక్కడ 'భారత్ బంద్' షూటింగ్ జరుగుతోంది. ఆ చిత్ర దర్శకులు కోడి రామకృష్ణ గారు అశోకా హోటల్ లో వున్నారంటే, ఆయన్ని చూద్దామని అక్కడికి వెళ్ళాను. అక్కడ ఆయన నన్ను చూడగానే – 'ఈ చిత్రంలో నువ్వు వేషం వేస్తున్నావు' అన్నారు. ముందు ఆయనేదో జోక్ చేస్తున్నారనుకున్నాను. ఆ తర్వాత ఆయన సీరియస్ గానే అంటున్నారని తెలిసి.

'నేనేం పెద్దగా చదువుకోలేదు. మూడో తరగతితో చదువాపేశాను. మాట్లాడ్డమే నాకు సరిగా రాదు. అలాంటి నేను వేషం వెయ్యడమేంటి.. వేషం వద్దు ఏం వద్దు నాకో పిక్చర్ డైరెక్టు చేసి పెట్టండి చాలు' అన్నాను.

అందుకాయన 'తప్పకుండా చేస్తాన'ని చెప్పి నేనెంత కాదన్నా. నాకేం రాదన్నా పట్టుబట్టి – 'మీరేం చెయ్యొద్దు, నేను చెప్పినట్టు చెయ్యండి. తక్కినవన్నీ నేను చూసుకుంటాను' అని ధైర్యం చెప్పి బలవంతం చేసి 'భారత్ బంద్' లో నా చేత 'కొండయ్య' వేషం వేయించారు.

మర్నాడు షూటింగ్ అనగా ముందు రోజు రాత్రి నిద్రపట్టలేదు. తెల్లవారు ఝామున మూడు గంటలకే లేచి జిడ్డు మేకప్ వేయించుకుని, చిరిగిపోయిన బట్టలు కట్టుకుని షూటింగ్ కి బయల్దేరాను – 'ఇదేం ఖర్మరా బాబూ' అనుకుంటూ.

హైద్రాబాద్ లో నాలుగు రోడ్ల జంక్షన్లో బడ్డీకొట్టు దగ్గర నేను పాల్గొన్న మొట్ట మొదటి దృశ్యం చిత్రీకరించారు. షూటింగ్ చూడ్డానికొచ్చిన జనాన్ని చూడగానే, నాకు కాళ్ళల్లో వణుకు పుట్టింది. 'షాట్ కి అంతా సిద్ధం చేసుకున్న తర్వాత, కోడి రామకృష్ణ గారు ఆ దృశ్యంలో నేనేం చెయ్యాలో, ఎలా చెయ్యాలో తను చేసి చూపించి అలా చెయ్యమన్నారు. ఆ క్షణంలో నిజంగా, ఎవరికీ చెప్పకుండా పారిపోతే బావుణ్ణనిపించింది. అంతలోనే ధైర్యం తెచ్చుకుని ఆయన చెప్పినట్టుగా చేశాను. ఆ షాట్ మొదటి టేక్ లోనే ఓకే అయింది. యూనిట్ సభ్యులు అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు నాకనిపించింది 'ఓస్ ఇంతేనా?' అని. ఆ తర్వాత నుంచీ ఆయన చెప్పినట్టే చెయ్యడం ప్రారంభించాను. మొదట్లో చిన్నదనుకున్న పాత్ర పరిధి పెరిగి చివరికి పెద్దదై పోయింది.

'చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకులు నీ పాత్ర పట్ల చూపే ఆదరణను బట్టే ఈ చిత్ర విజయం ఆధారపడి వుంది' అన్నారు కోడి రామకృష్ణ.

ఆ చిత్రం తర్వాత మళ్ళీ నటించ కూడదనుకున్నాను నేను అయితే చిత్రం విడుదలై ఆంధ్రదేశంలోనే గాక తక్కిన మూడు దక్షిణాది రాష్ట్రాల్లోనూ అఖండ విజయం సాధించింది. అన్ని చోట్లా, నేను ధరించిన 'కొండయ్య' పాత్రకు విశేషమైన ప్రశంసలు లభించాయి. ముప్పై మూడు సంవత్సరాలుగా 'కాస్ట్యూమ్ డిజైనర్' గా తెర వెనుక ఎన్నో చిత్రాలు

పని చేసినా రాని గుర్తింపు ఒకే ఒక్క చిత్రం ద్వారా ఒకే ఒక్క పాత్ర ద్వారా లభించినందుకు నాకు ఎంతో ఆనందం కలిగింది.

నా జీవితంలో నేను అనుకున్నది సాధించాను. నిర్మాతను అవ్వాలనుకున్నాను. అయ్యాను. కాని నేను అనుకోనిదల్లా నటుడ్ని కావడమే నాలో ఒక నటుడు దాగి వున్నాడని కోడి రామ కృష్ణ గారు ఎలా కనుక్కోగలిగారా అన్నది తలచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యమే !

'కాస్ట్యూమ్ డిజైనర్' గా, నిర్మాతగా, నటుడుగా.. మూడు బాధ్యతలను కృష్ణ ఎలా నిర్వహించగలుగుతున్నారు ?

'నిజానికి ఒక వ్యక్తి ఇన్ని బాధ్యతలను ఒకేసారి నిర్వహించడం కష్టసాధ్యమే! ఐతే, చిత్ర నిర్మాణానికి సంబంధించి నా పార్ట్ నర్స్ కె.వి.రావు. ఆదిరెడ్డి, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరావు, కాస్ట్యూమ్ డిజైనింగ్'కి సంబంధించి నా సహాయకులు రమేశ్, వేణుల సంపూర్ణ సహకారం నాకు లభించడం వల్లనే ఈ మూడు బాధ్యతలనూ సక్రమంగా నిర్వహించగలుగుతున్నాను'

ప్రస్తుతం కృష్ణ రైల్వే కూలి, గాడ్ ఫాదర్, మావూరి మారాజు, దొంగ రాస్కెల్, లేడీ బాస్, న్యాయరక్షణ, సురేంద్ర రాజు, 'సింధూర పువ్వు' కృష్ణారెడ్డి నిర్మించే చిత్రాల్లో ప్రధాన ప్రతి నాయకుడుగా, కామెడీ విలన్ గా వైవిధ్యమైన పాత్రలను పోషిస్తున్నాను. ఇవిగాక 'ఖల్ నాయక్' హిందీ చిత్రం ఆధారం శ్రీ సౌదామినీ క్రియేటర్స్ వారు నిర్మించే తమిళ చిత్రంలోనూ, కన్నడంలో 'లాకప్ డెత్' అనే చిత్రంలోనూ నటిస్తున్నాను.

★★★

COMMENTS